వైద్య శాఖ స్థలంపై పరుల కన్ను

ప్రహరీ నిర్మిస్తేనే.. రక్షణ

శిథిలావస్థకు చేరిన వైద్య సిబ్బంది గృహాలు

వనపర్తి వ్యవసాయం, న్యూస్‌టుడే : వైద్య, ఆరోగ్య శాఖకు గోపాల్‌పేటలో ప్రభుత్వం కేటాయించిన స్థలంపై పరుల కన్ను పడింది. ఇప్పటికే కొంత మేరకు ఆక్రమణకు గురైందని.. వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రహరీ నిర్మిస్తేనే స్థలం కబ్జాకు గురి కాకుండా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

సిబ్బంది నివాస గృహాల కోసం..: మండలాల వ్యవస్థ ఏర్పడిన తర్వాత ప్రతి మండల కేంద్రంలో ఒక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గోపాల్‌పేటలోని పీహెచ్‌సీలో పని చేసే వైద్యులు, సిబ్బంది స్థానికంగా నివాసం ఉండేందుకు రామ్‌నగర్ కాలనీ (దేవాలయం సమీపం)లో సుమారు అర ఎకరాకు పైగా భూమి కేటాయించి, అందులో నివాస గృహాలు నిర్మించింది. ఇవి ఆసుపత్రికి దూరంగా ఉండటంతో వైద్య సిబ్బంది అక్కడ ఎవరూ నివసించలేదు. అందులో అమర్చిన ఫ్యాన్లు, లైట్లు, కిటికీ తలుపులు, కరెంటు సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.

మరో శాఖకు బదిలీ చేయాలని..: భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం. అక్కడ ఎవరూ ఉండక పోవడం వల్ల ఆప్రాంతంపై ఇతరుల కన్ను పడింది. అటువైపు ఎవరూ సంచరించక పోవడం, ప్రహరీ నిర్మించక పోవడం కారణంగా ఆస్థలం ఆక్రమణకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. స్థలాన్ని వైద్యారోగ్యశాఖ నుంచి మరో శాఖకు బదిలీ చేయించి నివాస గృహాలుగా మార్చాలనే ప్రయత్నాలు కూడా చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ స్థలాలు ఎక్కడ కనిపించినా వాటిని ఆక్రమించుకునేందుకు చాలా మంది కొత్త దారులు వెతుకుతున్నారు.

వసతి గృహం నిర్వహణ..: గోపాల్‌పేటలో అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలుర వసతి గృహాన్ని, వృథాగా ఉన్న వైద్యసిబ్బంది నివాస గృహాల్లో నిర్వహిస్తే ప్రభుత్వానికి అద్దె మిగులుతుందని 'ఈనాడు'లో కథనం రావడంతో అధికారులు వసతి గృహాన్ని అక్కడికి తరలించారు. మూడేళ్ల కిందటి వరకు అందులోనే కొనసాగింది. భవనాలు శిథిలావస్థకు చేరడంతో మరో అద్దె భవనంలోకి వసతి గృహాన్ని మార్చారు.

స్థలాన్ని కాపాడతాం..

గోపాల్‌పేటలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది నివాస గృహాలు శిథిలావస్థకు చేరాయని, చుట్టూ ఖాళీస్థలం ఉన్న విషయం తెలిసింది. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడతాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తా.
- డాక్టర్ భాస్కర్ నాయక్, డీఎంహెచ్‌వో

నిఘా

గణనాథుడికి కష్టాలు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లో రూ.2 లక్షలు, రూ.1.50 లక్షలతో కొనుగోలు చేసిన వినాయక విగ్రహాలను సోమవారం యువకులు వాహనంలో తమిళనాడు రాష్ట్రం హోసూరుకు తరలించారు. జాతీయ రహదారిపై అమడబాకుల సమీపంలో ఏర్పాటు చేసిన బోర్డులు వీటికి తాకుతుండటంతో భారీ క్రేన్ సాయంతో వాహనం నుంచి గణనాథుడిని కిందకు దించి మరో వాహనంలోకి ఎక్కించారు. హైదరాబాద్ నుంచి కొత్తకోట వరకు వచ్చే వరకు క్రేన్‌కు రూ.20 వేలు, వాహనాల కోసం రూ.80 వేలు ఖర్చయినట్లు యువకులు తెలిపారు. పదిహేను మంది ద్విచక్ర వాహనాలపై వెళ్తూ ఎక్కడ ఇబ్బందులు లేకుండా చూసుకుంటూ ముందుకు సాగారు.

పాఠశాల విద్యలో కొత్త విధానం

చిన్నంబావి, పాన్‌గల్, న్యూస్‌టుడే : పాఠశాల విద్యలో కొత్త విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనంలో కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఎక్స్‌టర్నల్ ఎవాల్యుయేషన్ సిస్టమ్ పేరుతో కొత్త విధానాన్ని రూపొందించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త పద్ధతి ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి రానుంది.

పెద్దదగడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు

మండల కేంద్రాల్లో మూల్యాంకనం

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలు జరిగి అక్కడే మూల్యాంకనం జరిగేది. ప్రస్తుతం దానికి స్వస్తి పలికారు. కొత్త విధానంలో పరీక్షలు ఆయా పాఠశాలల్లోనే జరుగుతాయి. పరీక్ష పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను సంబంధిత ఉపాధ్యాయులు మండల విద్యాధికారికి అప్పగించాలి. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి వాటిని తరలిస్తారు. అక్కడ ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయిస్తారు. మూడు నుంచి అయిదు రోజుల్లోగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. వాటికి విద్యాశాఖ వారు పారితోషికం చెల్లిస్తారు.

పక్షపాతానికి అడ్డుకట్ట

సొంత పాఠశాల విద్యార్థుల జవాబు పత్రాన్ని అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు దిద్దడం వల్ల మార్కుల విషయంలో తేడా వచ్చే అవకాశం ఉంటుందని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు దిద్దడం ద్వారా నిష్పక్షపాతంగా మార్కులు కేటాయించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొత్త విధానంతో విద్యార్థుల వాస్తవ సామర్థ్యాలను గుర్తించే అవకాశం ఉంటుంది. ఏయే అంశాల్లో వారు వెనుకబడి ఉన్నారో గుర్తించి వాటిపై వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి వీలవుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు **725** : విద్యార్థుల సంఖ్య **38,880**

త్వరలో అమల్లోకి..

పాఠశాలల్లో నిర్వహించే ఎస్ఏ-1, ఎస్ఏ-2 పరీక్షలకు సంబంధించిన మూల్యాంకనాన్ని ఎమ్మార్సీలో చేసేలా ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. త్వరలోనే ఈ పద్ధతి అందుబాటులోకి రానుంది.
– రాజేందర్ రావు, ఎంఈవో, చిన్నంబావి.

తొలుత చదును.. ఆపై ఆక్రమణ

అంబాట్‌పల్లిలోని గుట్ట వద్ద ఇలా

ఈనాడు డిజిటల్, నాగర్‌కర్నూల్: జిల్లాలో ప్రభుత్వ భూములకు ఆనుకుని ఉన్న కొందరు పట్టాదారులు క్రమంగా హద్దులు దాటి భూములను చదును చేస్తూ స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రభుత్వ గుట్టల్లోని మట్టిని కొందరు అక్రమంగా తరలిస్తుంటే.. ఆ తర్వాత అదే ప్రాంతాన్ని ఇంకొందరు చదును చేసి క్రమంగా సాగుభూమిగా మార్చేస్తున్నారు.

ఇలాంటివి కొన్ని ఇలా...! : కోడేరులోని ఊరగుట్టను మూడు ఎకరాల వరకు తవ్వేసి చుట్టూ మామిడితోటను పెంచుతున్నారు. పసుపుల నడింగట్టు శివారున రెండెకరాల వరకు సాగుచేస్తున్నారు. కొల్లాపూర్ నుంచి సోమశిల వెళ్లేదారిలో గుట్టలు, అటవీభూమిని చదునుచేస్తున్నారు. బావాయిపల్లి శివారులోని ఎల్లమ్మతిప్ప వద్ద ఉన్న భూమి ఆక్రమణకు గురవుతోంది. తెలకపల్లి, రఘుపతిపేటకు సమీపంలోని రామగిరిగుట్ట మట్టిని నిత్యం తరలించేస్తున్నారు. అక్కడ చదును చేసిన ప్రాంతంలో క్రమంగా కొందరు వ్యక్తులు సాగులోకి తీసుకువస్తున్నారు. పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను క్రమంగా చదును చేస్తున్నారు. అటవీ భూములకు ఆనుకుని చెట్లను తొలగిస్తూ ఎకరాలను సాగులోకి తెస్తున్నారు.

అధికారులకు ఫిర్యాదు..: లింగాల మండలంలోని అంబటిపల్లి గ్రామంలోని సర్వేనం 471లో 6.36 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా చదును చేసి సాగుకు సిద్ధపడ్డారని పంచాయతీ తరఫున ఉపసర్పంచి సోమవారం 'ప్రజావాణి'లో ఫిర్యాదుచేశారు.

ఆర్ఐతో విచారణ.. : అంబాట్‌పల్లి శివారులోని సర్వేనం 471లో ప్రభుత్వ భూమి ఉంది. ఆక్రమణ విషయమై ఆర్ఐతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తాం. తగిన చర్యలు తీసుకుంటాం.
– వెంకటేశ్, తహసీల్దార్, లింగాల

ఆకాశాన.. మేఘాల పందిరి

ఈ చిత్రాన్ని చూస్తే పెళ్లి మండపంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపం, దానిపైనా తోరణాలు కట్టినట్లు కనిపిస్తుంది కదా. అయితే మీరు పొరపడినట్లే. ఇది పెళ్లిమండపం కాదు. ఆకాశంలోని మేఘాలు ఇలా చంద్రుడి చుట్టూ తోరణాలు కట్టినట్లు వరుస క్రమంలో కనిపిస్తున్న దృశ్యాలు పట్టణంలోని వీవర్స్‌కాలనీ సమీపంలోని దత్తాత్రేయ సంకల్ప సిద్ధి సాయిబాబా ఆలయ ఆవరణలో కనిపించాయి. ఆలయ పూజారి ఈ చిత్రాన్ని సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. – న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం

రూ.108 కోట్లతో రైల్వే అభివృద్ధి పనులు

- 2027లో గద్వాల స్టేషన్ శతాబ్ది ఉత్సవాలు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గద్వాల: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ డీకే అరుణ, డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్‌బాష షేక్

గద్వాల కలెక్టరేట్, అలంపూర్, శాంతిగనర్, న్యూస్‌టుడే: వందేళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న గద్వాల రైల్వే స్టేషన్ శతాబ్ది ఉత్సవాలను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 2027 ఏప్రిల్‌లో నిర్వహిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న అమృత్ భారత్ పథకంలో భాగంగా గద్వాల రైల్వే స్టేషన్‌లో రూ.108 కోట్లు వ్యయం చేస్తూ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఇటీవల రెండో రైల్వే గేటు వద్ద రూ.66 కోట్లతో మరో ఆర్వోబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గద్వాల రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీ డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, రైల్వే ఉన్నతాధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తెలంగాణలో 42 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.886 కోట్లు మంజూరు చేస్తే.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఒక్క తెలంగాణలో రైల్వేలకు రూ.5,454 కోట్లు కేటాయించిందన్నారు. ఈ ఏడాది 118 ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణంలో భాగంగానే గద్వాలకూ మంజూరు చేశారని గుర్తుచేశారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. గద్వాల మీదుగా రాకపోకలు సాగిస్తున్న పలు రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వందేభారత్ గద్వాల స్టేషన్‌లో ఆల్ట్‌కు పరిశీలించాలని రైల్వే ఉన్నతాధికారులను కోరారు. డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, గద్వాల పుర ఛైర్‌పర్సన్ జయలక్ష్మి పాల్గొన్నారు. ● అలంపూర్ హరిత టూరిజం వద్ద ఆర్డీఎస్, తుంగభద్ర డ్యామ్ నుంచి నీటి విడుదలలో నెలకొన్న సమస్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణకు సోమవారం రైతులు వినతిపత్రం అందజేశారు.

ప్లాస్టిక్ నిషేధం.. నల్లమల సురక్షితం

ఏటీఆర్‌లో వ్యర్థాల రీసైక్లింగ్

మన్ననూరులో బెయిలింగ్ యంత్రంలో ప్లాస్టిక్ సీసాలను వేస్తున్న సిబ్బంది

అమ్రాబాద్, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ భూతం నుంచి నల్లమలలోని వన్యప్రాణులు, అడవి నేల, జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు అటవీ శాఖ చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. నల్లమలను ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. మన్ననూరు చెక్‌పోస్టు వద్ద భక్తులు, పర్యాటకుల నుంచి ప్లాస్టిక్ నీటి సీసాలు, కవర్లను సేకరించి అడవిలో వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. సేకరించిన వ్యర్థాలను మన్ననూరు బెయిలింగ్ సెంటర్‌కు తరలించి బెయిళ్లుగా మార్చి విక్రయిస్తున్నారు.

వన్యప్రాణులకు ముప్పు..: ప్లాస్టిక్ కవర్లు, నీటి సీసాలను అడవిలో పడేయడంతో వన్యప్రాణులు, నేల ఆరోగ్యం దెబ్బతింటోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా తిన్న వన్యప్రాణులు మృత్యువాత పడే అవకాశం ఉంది

చెక్‌పోస్టు వద్దే అడ్డుకట్ట..: నల్లమల గుండా ప్రముఖ పుణ్యక్షేత్రాలు శ్రీశైలం, మద్దిమడుగుకు నిత్యం వందలాది వాహనాలు అటవీ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. భక్తులు ప్లాస్టిక్ సీసాల్లో నీటిని తీసుకెళ్తుంటారు. అడవిలోకి ప్రవేశించే ముందే వాటిని మన్ననూరు చెక్‌పోస్టు వద్ద సిబ్బంది సేకరిస్తున్నారు. లీటరు, అంతకన్నా తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్ నీటి సీసాల విక్రయాన్ని నల్లమలలో నిషేధించారు. పర్యాటకులు పడేసే ప్లాస్టిక్ సీసాలు, కవర్లను సేకరించేందుకు 16 మందిని వాచర్లను నియమించారు.

బెయిలింగ్, రీసైక్లింగ్‌కు తరలింపు..: సేకరించిన చెత్త, సీసాలను ప్రత్యేక వాహనం ద్వారా మన్ననూరు బెయిలింగ్ కేంద్రానికి తరలించి, బెయిళ్లుగా మార్చి నిల్వ చేస్తున్నారు. కొంత మొత్తం పోగైన తర్వాత వాటిని రీసైక్లింగ్ కేంద్రాలకు విక్రయిస్తున్నారు. గడిచిన రెండేళ్లలో ఒక్కొక్కటి సుమారు 30 కిలోల బరువుండే 345 ప్లాస్టిక్ సీసాల బెయిళ్లను విక్రయించారు. సగటున కిలో రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు ట్రిప్పులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : దాతలు, ఉన్నతాధికారుల సహకారంతో మర్రికుంట, రాజీవ్ చౌరస్తా, గాంధీచౌక్, మదనాపురం, పెబ్బేరులోని కొల్లాపూర్ చౌరస్తా ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు నిర్మిస్తామని ఆర్టీసీ డీఎం దేవేందర్ గౌడ్ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమైన రూట్లలో అదనపు ట్రిప్పులు నడుపుతామని పేర్కొన్నారు.

? హైదరాబాద్ బస్సులు పెబ్బేరు బస్టాండ్‌లోకి రావడం లేదు. షాపింగ్ కాంప్లెక్స్, ప్రహరీ నిర్మించాలి. - **దిలీప్ రెడ్డి**
✔ : బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం. షాపింగ్ కాంప్లెక్స్, ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం.

? మదనాపురంలో బస్‌షెల్టర్ నిర్మించాలి. బస్సులు లోపలికి రావడం లేదు.
- **అబ్దుల్ రవూఫ్, రాఘవేందర్**
✔ గ్రామంలోకి బస్సులు తీసుకెళ్లాలని డ్రైవర్లకు సూచిస్తా. దాతల సహకారంతో బస్‌షెల్టర్ల నిర్మాణానికి కృషి చేస్తా.

డీఎంతో సోమవారం 'ఈనాడు' ఫోన్‌ఇన్ నిర్వహించింది. ప్రజల ఫిర్యాదులు, సమస్యలను ఆయన ఓపిగ్గా విని సమాధానాలిచ్చారు. చేయి ఎత్తిన చోట బస్సు నిలపాలని డ్రైవర్లను ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు.

ఈనాడు మీ తోడు

సమాధానాలిస్తున్న డీఎం దేవేందర్ గౌడ్

? వనపర్తి బస్టాండులో ఉచిత మరుగుదొడ్ల వద్ద డబ్బు వసూలు చేస్తున్నారు.
- **పవన్‌కుమార్** ✔ ప్రజలు ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు.

? పాన్‌గల్ మండలం కొత్తపేట గ్రామానికి ఉదయం, సాయంత్రం ప్రయాణికులు అవసరాల మేరకు బస్సు నడపాలి. - **కిరణ్, సర్పంచి**
✔ ప్రస్తుతం బస్సు నడుస్తోంది. అదనపు ట్రిప్పులకు పరిశీలిస్తాం.

? ఖిల్లాగణపురం బస్టాండ్‌లో గుంతలు పడ్డాయి. హైదరాబాద్‌కు బస్సు నడపాలి. - **బుచ్చిబాబు గౌడ్, గోపి** ✔ సీసీ నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టాం. హైదరాబాద్‌కు బస్సు ఏర్పాటు చేస్తాం.

? మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లి గ్రామాలకు మధ్యాహ్నం, సాయంత్రం అదనపు ట్రిప్పులు నడిపి నైట్‌హాల్ట్ ఏర్పాటు చేయండి.- **ఈశ్వర్, రమేశ్, మాధవి అమ్మపల్లి సర్పంచి, బుచ్చిలింగం**
✔ గతంలో నడిపించాం. ప్రయాణికులు ఆశించిన స్థాయిలో ఎక్కడం లేదు. నైట్ హాల్ట్‌కు మరోసారి పరిశీలిస్తాం.

? కంచిరావుపల్లిలో ఉదయం వేళబస్సులు ఆపడం లేదు. - **బాలగౌడ్**
✔ బస్సులు ఆపాలని డ్రైవర్లుకు సూచిస్తాం.

? కొత్తకోట బస్టాండ్‌లో ప్రయాణికులకు సరిపడా మరుగుదొడ్లు లేవు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి. బస్‌పాస్ రెన్యువల్ కేంద్రం పెట్టాలి.
- **నాకొండ యాదవ్, ముజీబ్, శ్రీనివాసులు**
✔ మహిళలకు, పురుషులకు నాలుగేసి చొప్పున మరుగుదొడ్లు నిర్మిస్తాం. ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతాం. రెన్యువల్స్ తక్కువగా వస్తున్నాయి అందుకే తొలగించాం.

? వనపర్తి రాజీవ్ చౌరస్తాలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు రోడ్డుపై నిలబడి ప్రమాదాలకు గురవుతున్నారు. - **నిరంజన్ యాదవ్**
✔ బస్‌షెల్టర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం., దాతలు ముందుకు వస్తే నిర్మిస్తాం.

? ఏటిగడ్డశాఖాపూర్ గ్రామానికి ఉదయం, సాయంత్రం అదనపు ట్రిప్పులు నడపాలి. - **చెన్నకేశవులు** ✔ అదనపు ట్రిప్పులకు ప్రయాణికులు ఎక్కడం లేదు. ద్విచక్ర వాహనాలు, ప్రైవేట్ వాహనాలు వినియోగిస్తున్నారు.

? ఉదయం 10 గంటలకు, సాయంత్రం 7 తర్వాత శ్రీరంగాపురానికి బస్సు నడపాలి. - **పర్వతాలు, చంద్రశేఖర్** ✔ ప్రజలు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ఎక్కువగా వెళ్తున్నారు. పరిశీలించి నడిపేందుకు ప్రయత్నిస్తా.

? గోపాల్‌పేట మీదుగా హైదరాబాద్‌కు డీలక్స్ బస్సులు నడపాలి. - **మహేశ్**
✔ డీలక్స్ బస్సు నడుపుతాం.

? చెన్నూర్, కాశీంనగర్ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి. - **నరేశ్ నాయక్, సునీల్ నాయక్** ✔ ఈ రెండు గ్రామాలకు బస్సు వెళ్లేందుకు రోడ్డు సమస్య ఉంది. పరిష్కారం అయ్యాక నడుపుతాం.

పది రోజుల్లో భూసేకరణ పూర్తి

వనపర్తి, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు ప్రస్తుతం ఉన్న రైల్వే మార్గాన్ని డబుల్ లైనింగ్ చేసేందుకు వనపర్తి జిల్లాలో చేపట్టాల్సిన భూసేకరణ పనులు పది రోజుల్లో పూర్తి చేయడం జరుగుతుందని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం రాష్ట్రంలోని రైల్వే రోడ్డు ప్రాజెక్టుల భూసేకరణ, తలెత్తుతున్న ఇబ్బందులపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆరేపల్లి వద్ద 69 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా ఇప్పటికే 43.34 ఎకరాలు భూసేకరణ చేసి అవార్డు పాస్ చేసి డబ్బులు రైతులకు అందజేయడం జరిగిందన్నారు. మిగిలిన 19.36 ఎకరాలు సేకరించి అప్పగిస్తామన్నారు.

రైతేరాజు 6లో..

వెలిగొండ ద్వారా జలచౌర్యం.. అడ్డుకోని సీఎం : భారాస

ప్రాజెక్టుల వివరాలను తెలియజేస్తున్న నిరంజన్ రెడ్డి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ అడ్డగోలుగా కృష్ణా జలాలను దోపిడీ చేస్తుంటే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. సోమవారం భారాస జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డితో కలిసి ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కృష్ణా నది జలాల్లో తెలంగాణ వాటా గురించి వివరించారు. నాడు మద్రాస్ రాష్ట్రానికి తాగునీరు సరఫరా చేయాలన్న డిమాండుతో తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలు త్యాగం చేయడంతో పోతిరెడ్డి పాడు ప్రాజెక్టు పక్కన తూము ద్వారా 15 టీఎంసీల నీటిని తెలుగుగంగ కాల్వల ద్వారా తరలించారని పేర్కొన్నారు. మద్రాసుకు 4 నుంచి 5 టీఎంసీల నీరు మాత్రమే ఇవ్వగా కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాలో సాగునీటి అవసరాలకు రెండు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు. అసలు వరద జలాలను మాత్రమే తరలించాలని నియమం ఉండగా ఎలాంటి వరద లేని సమయంలో ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తాము అధికారం చేపట్టిన అనంతరం కేఎల్ఐ కోసం రూ.800 కోట్లు ఖర్చు చేశామని, పాలమూరు-రంగారెడ్డికి నిధులు కేటాయించి దాదాపు 85 శాతం పనులు పూర్తి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి మూడేళ్లు కావస్తున్నా నేటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది అన్నచందంగా పనులు నిలిచి పోయాయని విమర్శించారు. నాడు అప్పర్ కృష్ణా ప్రాజెక్టు ద్వారా 100 టీఎంసీలు, భీమా ప్రాజెక్టు ద్వారా 100 టీఎంసీలు, తుంగభద్ర హైలెవల్ కెనాల్ ద్వారా 19 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోవడానికి మూడు ప్రాజెక్టులు మంజూరు చేయాల్సి ఉండగా నాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి రద్దు చేశారని, అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌దే ఈ నిర్వాకమని ఆరోపించారు. వీటన్నింటికి బాధ్యత వహించాల్సింది సీఎం రేవంత్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. ఇవన్నీ పక్కకు పెట్టి నిరాధారమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు.

రైతు వేదికలకు సౌర వెలుగులు

భవనాల పరిస్థితిపై నివేదిక కోరిన ప్రభుత్వం

రైతు వేదిక ర్యాంపునకు పగుళ్లు

అయిజ, న్యూస్‌టుడే: రైతు వేదికలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా సౌర పలకల ఏర్పాటుకు అనుమతించింది. వీటిని అమర్చేందుకు ప్రభుత్వ రంగ సంస్థ హైదరాబాద్ వ్యవసాయ సహకార సంఘాని (హాకా)కి బాధ్యతలు అప్పగించింది. జిల్లాల వారీగా రైతు వేదికల పరిస్థితిపై నివేదిక అందజేయాలని ప్రభుత్వం కోరింది. జిల్లా వ్యవసాయాధికారులు నివేదిక తయారీలో నిమగ్నమయ్యారు.

నిర్వహణ లోపంతో.. : ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో చాలా రైతు వేదికలు అధ్వానంగా మారాయి. తలుపులు, కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. మెట్లు, ర్యాంపులు పగుళ్లిచ్చాయి. కొన్నిచోట్ల ముళ్ల చెట్లు పెరిగాయి. నిర్వహణకు నిధులను మంజూరు కాకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో 472..: గత ప్రభుత్వం క్లస్టర్లను ఏర్పాటు చేసి రైతు వేదికలు నిర్మించింది. ఒక్కో వేదికను రూ.22 లక్షలతో నిర్మించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 472 రైతు వేదికల నిర్మాణాలకు రూ.103.84 కోట్లు వెచ్చించారు.

రక్షణ లేక చోరీలు..: వేదికలకు రక్షణ లేకపోవడంతో రాత్రిళ్లు చోరీలు జరుగుతున్నాయి. చాలాచోట్ల ఎలక్ట్రిక్ పరికరాలు, బ్యాటరీలు, విలువైన వస్తువులు తదితరాలు చోరీ చేశారు. దొంగతనాలను అరికట్టడానికి ఇప్పటికైనా సౌర విద్యుత్తు కంచె ఏర్పాటు చేయాలని రైతులు, వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

నీటి వసతి కరవై..: కనీసం నీటి వసతి కూడా లేకపోవడంతో రైతులు, వ్యవసాయశాఖ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. వేదికలను శుభ్రం చేసేందుకు, సమావేశాలకు కుర్చీలు వేసేందుకు స్వీపర్లు లేరు. అన్నీ ఏఈవోలే చూసుకుంటున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల పరిశుభ్రత, ఇతర ఖర్చులను అధికారులే భరిస్తున్నారు.

జిల్లా	రైతు వేదికలు
గద్వాల	94
మహబూబ్‌నగర్	88
నాగర్‌కర్నూల్	142
నారాయణపేట	77
వనపర్తి	71

4న కబడ్డీ జట్టు ఎంపిక

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 4న జిల్లా సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, కార్యదర్శి కురుమయ్య తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 75 కిలోల లోపు బరువు ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 70130 50502 నంబరును సంప్రదించాలన్నారు.

(c) eenadu

గుంత తవ్వి.. మరమ్మతులు మరిచి

పట్టణంలోని చేపల మార్కెట్‌కి వెళ్లే దారిలో మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం అయిదు రోజుల క్రితం గుంత తవ్వి పనులు పూర్తి చేయలేదు. ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు పూర్తి చేసి గుంతను పూడ్చాలని, అప్పటి వరకు భద్రతా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెబ్బేరు పట్టణం**

పట్టు వీడకు.. ప్రమాదానికి చోటివ్వకు

మహబూబ్‌నగర్ నుంచి నారాయణపేట వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. ఉదయం, సాయంత్రం బస్సులు సరిపడా లేకపోవడం, ఉన్నా అందులో నిల్చోవడానికి స్థలం దొరకకపోవడంతో ఫుట్‌బోర్డుపైనే ప్రమాదకరంగా నిలబడి ప్రయాణం సాగిస్తున్నారు. ఏ మాత్రం అదుపుతప్పినా పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పాలమూరు నగరంలో సోమవారం తీసిన చిత్రమిది. **- న్యూస్‌టుడే, నవాబ్‌పేట, కార్పొరేషన్**

సస్యరక్షణతో వేరుసెనగలో అధిక దిగుబడి

మదనాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ఆయా ప్రాంతాల్లో రైతులు ఆరుతడి పంట కింద యాసంగిలో వేరుసెనగ సాగు చేస్తారు. కలుపు, చీడపీడల నివారణ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త, కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. టీఏజీ 24, కదిరి 6, కదిరి 9, లేపాక్షి, హరితాంధ్ర, ధరణి, జేఎల్ 24, జగిత్యాల పల్లీ 1, టీసీజీఎస్ 1694, గిరినార్-3 గిరినార్-4 అధిక దిగుబడికి అనువైన రకాలని పేర్కొన్నారు. సెప్టెంబరు రెండో వారం నుంచి నవంబరు మొదటి వారం వరకు విత్తనాలు విత్తుకోవచ్చు. 22.5 సెం.మీ.× 10 సెం.మీ. దూరంలో ఎకరాకు 4.4 లక్షల మొక్కలు ఉండేలా చూసుకోవాలని సూచించారు.



కొన్నూరులో సాగైన వేరుసెనగ

విత్తనశుద్ధి : టెబ్యూకోనజోల్ 2డీఎస్ మందును ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకొని ట్రైకోడెర్మా 10 గ్రా., అనంతరం రైజోబియం 5 గ్రా. విత్తనం వేసే 2 గంటల ముందు కలిపి విత్తుకోవాలి.

పోషకాల యాజమాన్యం: భాస్వరం, పొటాష్ ఎరువులను విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఎకరానికి 100 కిలోల సూపర్ పాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేసుకోవాలి. పంట పూత, ఊడలు దిగే సమయంలో 200 కిలోల జిప్సం మొదళ్ల దగ్గర వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో ఎకరానికి 10 లేదా 12 కిలోల యూరియా చల్లాలి.

కలుపు పద్ధతి..: విత్తిన వెంటనే లేదా 2 రోజుల లోపు కలుపు నివారణకు అలాక్లోర్ ఒక లీటరు లేదా పెండిమిథాలిన్ 1.3 లీటర్లు ఎకరానికి 200 లీటర్ల నీటిని కలిపి నేలపై పిచికారీ చేయాలి. గడ్డిజాతి మొక్కలు ఉంటే నివారణకు క్విజాలోఫాప్-పి-ఇథైల్ ఎకరాకు 400 మి.లీ. లేదా ప్రొపాక్విజాఫాప్-పి-ఇథైల్ ఎకరాకు 250 మి.లీ. విత్తిన 20 రోజుల వరకు పిచికారీ చేసుకోవచ్చు. వెడల్పాకు, గడ్డిజాతి కలుపు 2, 3 ఆకుల దశలో ఉన్నప్పుడు ఇమాజెతాపైర్ 10 శాతం ఎకరాకు 300 మి.లీ. లేదా ఇమాజామాక్స్+ఇమాజెథాపైర్ 40 గ్రాముల కలుపు మందు ఎకరానికి 200 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడలు..: రసం పీల్చు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.4 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దెపురుగు నివారణకు మొదటిదశలో 5 మి.లీ. వేప మందు (ఎన్ఎస్‌కేఈ)ను క్లోరోఫైరిఫాస్ 50 ఈసీ 1.5 మి.లీ. లేదా న్యూవలురాన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. మందులను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. టిక్కా ఆకుమచ్చ, కాండం కుళ్లు నివారణకు క్లోరోథానిల్ 2 గ్రా. లేదా హెక్సాకోనాజోల్ 2 మి.లీ. లేదా టెబ్యూకోనోజోల్ 1 మి.లీ. లేదా టెబ్యూకోనోజోల్+ ట్రైఫ్లాక్సిస్ట్రెబిన్ ఒక గ్రాము మందును ఏదైనా ఒకటి లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

ఆర్టీసీలో అవిశ్రాంత పోరాటం!

- ప్రయోజనాలు అందక ఏళ్లుగా నిరీక్షణ
- ఆర్థిక ఇబ్బందుల్లో అల్లాడుతున్న వైనం

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీలో ఉద్యోగ విరమణ పొందిన వారిని కుటుంబ సభ్యులు ఓ విషయంలో ఎప్పుడూ తప్పుబడుతుంటారు. ఏ కాస్త సమయం దొరికినా డిపోల వద్దకు చేరి ఆర్టీసీ బాగోగుల గురించి ఎందుకు చర్చిస్తుంటారని ప్రశ్నిస్తుంటారు. విశ్రాంత జీవితంలోనూ సంస్థ గురించి తపన పడే వారిప్పుడు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు దక్కక కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పది ఆర్టీసీ డిపోల పరిధిలో ప్రతి నెలా సగటున 25 నుంచి 30 మంది (డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఇతర సిబ్బంది) ఉద్యోగ విరమణ చేస్తున్నారు. వీరికి నెలలు గడుస్తున్నా విశ్రాంత ప్రయోజనాలు అందడం లేదు. ఒక్కో ఉద్యోగికి సగటున రూ.20 లక్షలకు పైబడే అందాల్సి ఉంది. ఈ డబ్బులు చేతికి ఎప్పుడు అందుతాయోనని విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు మహబూబ్‌నగర్‌లోని ఆర్ఎం కార్యాలయం చుట్టూ రోజూ చెప్పులరిగేలా తిరుగుతుంటారు.

ఉచిత పథకాల పుణ్యమా అంటూ..: ప్రభుత్వాలు ఉచిత పథకాలు అమలు చేస్తున్న కారణంగా బడ్జెట్ లేక ఆయా ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగ విరమణ చేసే తమకు సకాలంలో ప్రయోజనాలను ఇవ్వలేకపోతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితి ఆర్టీసీలోనే కాదూ ప్రతి శాఖలోనూ ఎదురవుతోందంటున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసిన వారికి మూడు నుంచి ఆరు మాసాల్లోగా రిటైర్డ్ బెనిఫిట్స్ వచ్చేవి. ఆ తర్వాత ఈ గడువు ఏడాదికి పెరిగింది. కాలక్రమేణా ఇది రెండు నుంచి మూడేళ్లకు చేరడంతో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది.

సర్వీసు నిబంధనల ప్రకారం: ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసే వారికి వారం ముందే ప్రయోజనాలు (పీఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ, పీఆర్సీ ఎరియర్స్) ఖాతాల్లో జమ చేయాలి.

కుమార్తె పెళ్లికి అప్పు చేశా

2024 నవంబర్‌లో ఆర్టీసీ గద్వాల డిపోలో ఏడీసీ కంట్రోలర్‌గా ఉద్యోగ విరమణ చేశా. 20 మాసాలు గడుస్తున్నా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదు. రూ.20 లక్షలకు పైగా నాకు రావాలి. చేతిలో డబ్బు లేకపోవడంతో అప్పు చేసి కుమార్తె పెళ్లి చేయడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఆర్ఎం కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. **- కె.సుధాకర్‌రెడ్డి, విశ్రాంత కంట్రోలర్, పుట్టపల్లి**

పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లలున్నారు.. కనికరించాలి

మహబూబ్‌నగర్ డిపోలో ఐదు నెలల కిందట ఉద్యోగ విరమణ చేశా. 2017, 2021 సంవత్సరాల పీఆర్సీ బకాయిలతో పాటు డీఏ ఎరియర్స్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు రావాల్సి ఉంది. ఇద్దరు అమ్మాయిల పెళ్లిళ్లు చేద్దామని భావిస్తే ఇంత వరకు ఆర్టీసీ నుంచి ప్రయోజనాలు రావడం లేదు. కుటుంబ పోషణ భారంగా ఉంది. విశ్రాంత ఉద్యోగులపై కక్ష సాధించకుండా వెంటనే ఇవ్వాలి. **- ఎస్.సుగుణమ్మ, విశ్రాంత కండక్టర్**

రూ. 20 లక్షల వరకు రావాలి

మహబూబ్‌నగర్ డిపోలో డ్రైవర్‌గా చేస్తూ ఉద్యోగ విరమణ చేశా. రూ.20 లక్షల వరకు ప్రభుత్వం నుంచి రావాలి. ఇప్పుడు అప్పుడంటూ ఎదురుచూడటం తప్ప ఇవ్వడం లేదు. అప్పు చేసి బిడ్డ పెళ్లి చేశా. అప్పుల వాళ్లు ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేకపోతున్నా. **- కె.శ్రీనివాసులు, విశ్రాంత డ్రైవర్**

మా డబ్బు మాకు ఇప్పించండి సార్..

సోషల్ మీడియాలో ప్రకటన చూసి మోసపోయాం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: స్క్రబ్ ఎక్స్ పేరుతో రమేష్ అనే వ్యక్తి, మరికొందరు మోసం చేసి డబ్బు తీసుకుని బోర్డు తిప్పేశారు.. ఈ కేసులో నిందితుడు తిరుమలకొండ రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు.. అతడి నుంచి తమకు రావాల్సిన డబ్బు ఇప్పించాలని మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం, శ్రీ సత్యసాయిజిల్లా, అనంతపురం, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు చెందిన స్క్రబ్ ఎక్స్ బాధితులు విన్నవించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లెలో సోమవారం నిర్వహించిన పోలీసు పీజీఆర్ఎస్‌లో ఎస్పీ ధీరజ్‌కు వారు ఫిర్యాదు చేశారు.. తాము సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటన చూసి మోసపోయామని వాపోయారు. డబ్బు కట్టామని నిందితుడితో పాటు సంబంధిత పోస్టు పెట్టిన సోషల్ మీడియా నిర్వాహకులపైనా చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

సాగులో.. సమస్యలా?

బిజినేపల్లి, న్యూస్‌టుడే : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11-12 గంటల మధ్య చరవాణి నంబరు 99514 61694ను సంప్రదిస్తే సందేహాలు నివృత్తి చేస్తామని కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డా.శైల తెలిపారు.

రైతేరాజు

పశువుల పేడ ఎంత వాడాలి?

మీ కోసం

హన్వాడ, న్యూస్‌టుడే : ఎకరానికి పశువుల పేడ ఎంత వాడాలో చాలా మంది రైతులకు తెలియదు. రూ.వేలు ఖర్చు చేసి ట్రాక్టర్ల కొద్దీ పొలాల్లో వేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. ఎలాంటి రసాయన మందులు చల్లని రైతులు ఎకరానికి 100 కిలోల జల్లెడ పట్టిన పశువుల ఎరువు వాడితే సరిపోతుంది. దీన్ని కల్చర్ మాదిరిగా ఉపయోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. పశువుల ఎరువును పెంటకుప్ప నుంచి తీసి ఏడు రోజుల పాటు ఆరబెట్టి జల్లెడ పట్టాలి. వానాకాలం, యాసంగిలో విత్తనాలు విత్తేటప్పుడు వేసుకుంటే సరిపోతుంది. దీంతో పాటు పొడిగా ఉండే ఘనజీవామృతాన్ని కలిపి విత్తుకోవచ్చు.

పురుగుల నివారణలో జిగురు అట్టల పాత్ర కీలకం

బిజినేపల్లి, న్యూస్‌టుడే : లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు ఉపయోగించి ఎరువుల వినియోగం తగ్గిస్తూ, పంటకు హాని చేసే కీటకాలు, కాయతొలిచే పురుగును అరికట్టవచ్చని కేవీకే కీటక శాస్త్రవేత్త డా.శైల తెలిపారు.

ఇలా చేయాలి.. : అన్ని రకాల పంటలకు ఆశించే పచ్చదోమ, తెల్లదోమ, పేనుబంక పురుగులను పసుపురంగు అట్టలు ఆకర్షిస్తాయి. ముఖ్యంగా కూరగాయల పంటల సాగులో వీటిని వినియోగించవచ్చు. ఎకరానికి 20-25 అమర్చుకోవాలి. వివిధ రకాల పంటలకు ఆశించే ఎర్ర నల్లి, తెల్ల నల్లి, తామర పురుగు నివారణకు నీలి రంగు అట్టలు వాడవచ్చు. ఎకరానికి 20 -25 అమర్చుకోవాలి. తెలుపు రంగు జిగురు అట్టలను రసం పీల్చే పురుగులు, తామర పురుగు నివారణకు వాడవచ్చు. ఎకరానికి 20-25 అమర్చుకోవాలి

లింగాకర్షక బుట్టలు : కాయ తొలుచు పురుగుల నివారణకు వీటిని వాడతారు. వీటి వల్ల మగ పురుగులు ఆకర్షితమై, సంతతి గణనీయంగా తగ్గుతుంది. వీటిని ప్రతి 21 రోజులకు ఒకసారి మార్చడం వల్ల మగ పురుగులను ఆశించే సామర్థ్యం పెరుగుతుంది. ● పురుగుల ఉద్ధృతిని గమనించడానికి ఎకరానికి 4-5 బుట్టలు అమర్చుకోవాలి. 10-20 బుట్టలు అమర్చుకోవడం ద్వారా కొంత మేర పురుగును నివారించవచ్చు. 50-60 శాతం నివారణకు లేదా పరాగసంపర్కాన్ని నిరోధించడానికి ఎకరానికి 100-120 బుట్టలు అమర్చుకోవాలి. పంటల ఎత్తు పెరిగే కొద్ది వీటి ఎత్తు పెంచుకోవాలి.

ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? **- శివకుమార్, పెబ్బేరు**

✔ నారు నాటిన 15 రోజుల తర్వాత ఎకరానికి 4 కిలోల క్లోరాంట్రనిలిప్రోల్ గుళికలు వేయాలి.

? కందిలో ఆకులపై పురుగులు గూడు పెడుతున్నాయి. వాటి ఎలా నివారించాలి? **- నిరంజన్ యాదవ్, చేగుంట**

✔ కందిలో ఆకుగూడు నివారణకు 2 మి.లీ. క్లోరిపైరిఫాస్ ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఆకు గూడును అరికట్టవచ్చు.

? జొన్నలో మొవ్వ తొలుచు పురుగు ఆశించింది. నివారణ ఎలాంటి చర్యలు చేపట్టాలి? **- రామాంజనేయులు, మమ్మాయిపల్లి**

✔ జొన్న శాఖీయ దశలో మొవ్వతొలుచు పురుగును గమనిస్తే 1.0 మి.లీ. సైపర్‌మెత్రిన్ ద్రావణానికి లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి.

(కేవీకే కీటక శాస్త్రవేత్త డా.శైల సమాధానాలిచ్చారు)

- న్యూస్‌టుడే, బిజినేపల్లి

అర చేతిలో పల్లె ప్రగతి

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఏ సమాచారాన్నైనా ఒక్క క్లిక్‌తో తెలుసుకోవచ్చు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా 'జీపీ ప్రొఫైల్' (జీపీఎస్ఏపీ) అనే వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చాయి. రాష్ట్రంలోని అన్ని పంచాయతీల సమగ్ర సమాచారాన్ని అభివృద్ధి పనులు, ప్రణాళికలను పారదర్శకంగా నిర్వహించడానికి ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. పంచాయతీకి సంబంధించిన ప్రతి అంశాన్ని డిజిటలైజ్ చేశారు. ఈ పోర్టల్‌లో పల్లెలకు సంబంధించిన పూర్తి వివరాలు చూడటానికి చరవాణి లేదా అంతర్జాలంలోని గూగుల్ క్రోమ్‌ను తెరిచి https://gpsap&prrd.telangana.gov.in/gpprofile లింక్‌ను ఓపెన్ చేయాలి.

జిల్లాల వారీగా పంచాయతీల వివరాలు	
వనపర్తి	268
మహబూబ్‌నగర్	423
నాగర్‌కర్నూలు	460
నారాయణపేట	272
జోగులాంబ గద్వాల	255

వెబ్ పేజీలో సమగ్ర సమాచారం: పేజీని తెరిచిన వెంటనే జిల్లా, మండలం, పంచాయతీ కోడ్ నమోదు చేస్తే అందులో ప్రజాప్రతినిధులు, కార్యదర్శి వివరాలతో పాటు పంచాయతీలో ఉన్న జనాభా (స్త్రీ, పురుషులు), గృహాల సంఖ్య పొందుపరిచారు. వీటితో పాటు సీసీ రహదారులు, మురుగు కాల్వలు, వీధి దీపాలు, తాగునీటి కనెక్షన్లు, డంపింగ్ యార్డు, వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్, ట్రాక్టర్ లభ్యత, పంచాయతీ అధీనంలో ఉన్న భవనాలు, స్థలాలు, కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధుల వినియోగం, తదితర అంశాలను వెబ్ పేజీలో అందుబాటులో ఉన్నాయి.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం

పీయూ వీసీ శ్రీనివాస్

పాలమూరు, న్యూస్‌టుడే: అధ్యాపకులు, సిబ్బంది నిత్యం ఏదో ఒక క్రీడ ఆడుతూనే ఉండాలని, అప్పుడు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు స్థానిక పీయూలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి పలు క్రీడాపోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల మధ్య స్నేహభావం, సమన్వయం పెంపొందడానికి ఇటువంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సూచించారు. ఈ క్రీడా పోటీలు సోమవారం నుంచి గురువారం వరకు జరుగుతాయన్నారు. వీసీ, ఓఎస్డీ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో వీసీ జట్టు 60 పరుగుల తేడాతో గెలుపొందింది. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, పీడీ శ్రీనివాసులు, పలు విభాగాల అధ్యాపకులు నాగం కుమారస్వామి, రాజ్‌కుమార్, ఈశ్వర్‌కుమార్, రవికుమార్, అర్జున్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాస్, గాలెన్న, సుస్మిత, చిన్నాదేవి, ప్రభాకర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, రంగప్ప పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుతున్న వీసీ జీఎన్ శ్రీనివాస్

316 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు(అమరచింత), న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి వరద రావడంతో సోమవారం 8 టర్బయిన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టారు. ఎగువన 4, దిగువన 4 యూనిట్లలో 316 మెగావాట్ల ఉత్పత్తి జరిగిందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. పవర్ హౌస్ ద్వారా 21,324 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయ సమాచారం

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం ఉదయం 6.00 గంటలకు, జోగులాంబ అమ్మవారి ఆలయం ఉదయం 6.30కు తెరుస్తారు. స్వామి వారి ఆలయంలో ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, ఉదయం 9 నుంచి 11 గంటలకు రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, 11.30 నుంచి 12 గంటల వరకు నివేదన, మహా మంగళహారతి ఉంటాయి. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు ఆలయాలు మూసివేస్తారు. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, రాత్రి 7.30 గంటలకు మహా మంగళహారతి. జోగులాంబ ఆలయంలో ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు త్రిశతి అర్చన, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఖడ్గమాల అర్చనలు కొనసాగుతాయి. రాత్రి 7కు మహా మంగళహారతి అనంతరం రాత్రి 8.30 గంటలకు ఆలయాలు మూసివేస్తారు.

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

మహబూబ్‌నగర్ భగీరథకాలనీ నర్సరీ బజార్ మినీ అపార్ట్‌మెంట్ నందు 66 గజాల ఈస్ట్ ఫేస్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర: 9704209449

JOBS

Required Female Typist for Jaya Diagnostic Centre, Club Road, Jadcherla, Behind M.R.O office, fast typing skills required English Language, Salary as per experience.... Jaya Diagnostic Centre, Club Road, Jadcherla. Contact Number : 99665 02502

Book Your 5 Lines Classified Advertisement for B&W Rs. 335/- Only Colour Rs. 395/- Only GST 5% Extra For further details Contact : Mahabubnagar 8008709794

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 8008709794

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 8008001824

గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్టు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గద్వాల జిల్లా కేంద్రంలో ఆదివారం తొలిసారి పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడిన విషయం తెలిసిందే. సోమవారం డీఎస్పీ మొగులయ్య పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ శ్రీనుతో కలిసి వివరాలు వెల్లడించారు. ఇటిక్యాల మండలానికి చెందిన బోయ బీసన్న(50), మల్దకల్ మండలానికి చెందిన తనగల గోకారి (29) గంజాయిని సరఫరా చేస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో వారిని పట్టుకొని 5.057 కేజీల 10 ప్యాకెట్ల గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఇద్దరు తమ భూముల్లో పంటల సాగుతో పాటు గంజాయి మొక్కలు పెంచి వాటిని ఎండబెట్టి గద్వాల, ఎర్రవల్లి, కొత్తకోట ప్రాంతాల్లో విక్రయించేందుకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై గద్వాలకు వస్తున్నారన్న సమాచారంతో పట్టుకున్నట్లు వివరించారు. ఇద్దరిపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొగులయ్య

ఎస్సైని సస్పెండ్ చేయాలని భాజపా ధర్నా

ఎస్పీ కార్యాలయానికి ఎస్సై అటాచ్

కోడేరు, న్యూస్‌టుడే: యువకుణ్ని ఠాణాకు పిలిపించి ఎస్సైతో పాటు నలుగురు కానిస్టేబుళ్లు కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో చోటుచేసుకున్న పరిణామాలు కోడేరు ఎస్సైని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసేవరకు వెళ్లాయి. బాధితుడితో పాటు భాజపా నేతలు, గ్రామస్థులు సోమవారం ధర్నా నిర్వహించడంతో మండల కేంద్రంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బాధితుడు, గ్రామస్థుల కథనం ప్రకారం. . మండలంలోని ఠాకూర్‌తండాకు చెందిన డా.పరమేశ్వర్, నార్యానాయక్‌తండాకు చెందిన పాండునాయక్ వ్యక్తిగతంగా సోషల్ మీడియాలో విమర్శలు చేసుకున్నారు. దీంతో పాండునాయక్ కోడేరు ఠాణాలో పరమేశ్వర్‌పై ఫిర్యాదు చేశారు. పరమేశ్వర్‌ను ఆగస్టు 28న విచారణకు ఠాణాకు పిలిపించి ఎస్సై వేణుగోపాల్, కానిస్టేబుళ్లు కొట్టారు. గాయపడిన బాధితుడు తండా ప్రజలు, భాజపా నాయకుడు ఎల్లేని సుధాకర్‌రావుకు మొరపెట్టుకున్నారు. అంతకు ముందే డీజీపీకి ఫిర్యాదు చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా సోమవారం భాజపా నాయకులతో ఠాణాకు పాదయాత్రగా వెళ్లారు. కొల్లాపూర్ సీఐ శంకర్, ఎస్సై, సిబ్బందితో వారిని అడ్డుకోగా రోడ్డుపై బైఠాయించారు. ఈ విషయంలో 'న్యూస్‌టుడే' డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్‌ను వివరణ కోరగా ఎస్సై వేణుగోపాల్‌పై గతంలోనే పలు ఆరోపణలు వచ్చాయన్నారు. తాజా ఆరోపణలతో ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు వివరించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కొల్లాపూర్ సీఐ శంకర్.. కోడేరు ఠాణా బాధ్యతలు చూస్తారని, త్వరలోనే మరో ఎస్సైని నియమిస్తామన్నారు.

కేసుల దర్యాప్తును వేగవంతం చేయండి

మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం

భూత్పూర్, న్యూస్‌టుడే: పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం సూచించారు. భూత్పూర్ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ జానకితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఠాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సిబ్బందిని అప్రమత్తం చేయాలని అన్నారు. వివిధ ఠాణాల దస్త్రాలు పరిశీలించి నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల నియంత్రణకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్సైలు పాల్గొన్నారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం, ఎస్పీ జానకి

ఎయిడ్స్ నియంత్రణకు సమష్టి కృషి

పాలమూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించడానికి సమష్టి కృషి అవసరమని, లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ జేడీ డా.జయలక్ష్మి వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు పలు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమణ నివారణ (పీపీటీసీటీ) సేవలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్ బాధితులు మహబూబ్‌నగర్ జీజీహెచ్‌లోని ఏఆర్‌టీ సెంటర్‌కు వస్తున్నారని, వారికి నాణ్యమైన వైద్యసేవలతో పాటు సలహాలు, సూచనలు అందించాలన్నారు. జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ కుష్ఠు విభాగ అధికారి రాజు, డా.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ జేడీ జయలక్ష్మి

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు

వనపర్తి: 8008573864 | అమరచింత: 8008573841
పెబ్బేరు పట్టణం: 9676809678 | మదనాపురం: 9121229047
కొత్తకోట గ్రామీణం: 8008573855 | ఖిల్లాగణపురం: 9121229043
పానగల్: 8008574927

? పెబ్బేరులోని చిన్న వీరేల చావిడి వద్ద ఉన్న కల్వర్టులో మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు నిలిచి దుర్వాసన వస్తోంది. - అశోక్
✔ పరిశుభ్రం సిబ్బందిని పంపించి పూడిక తొలగించి సమస్య పరిష్కరిస్తాం. - యోగేష్ కుమార్, పుర శానిటరీ ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, పెబ్బేరు పట్టణం

తెరపై ఈనాడు

శ్రీనివాస: ఇరుముడి, శ్రీరామ: విశ్వనాథ్ అండ్ సన్స్, శ్రీరంగ టాకీస్, వెంకటేశ్వర: హాయ్ - న్యూస్‌టుడే, వనపర్తి

ఓటరు ధ్రువీకరణ పత్రాన్ని నమోదు చేయాలి

మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, న్యూస్‌టుడే: ఎస్ఐఆర్ తదుపరి వివరాల ప్రక్రియలో ఆనామా లీస్ నోటీసులు అందుకున్న ఓటరు తప్పనిసరిగా తమ తల్లిదండ్రుల ప్రజా ధ్రువీకరణ పత్రాన్ని బూత్ లెవల్ అధికారి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, బూత్‌లెవల్, సూపర్‌వైజర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శ్రీమూలంబంధువులున్న వారు వారితో పాటు తల్లిదండ్రుల ధ్రువీకరణ పత్రాలలోని బూత్ లెవల్ అధికారి తన సొంత సంతకంతో ధ్రువీకరణ పత్రం నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్లు, బీఎల్వో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

భీమా ఎత్తిపోతలకు 872 క్యూసెక్కులు

మదనాపురం, న్యూస్‌టుడే: రామన్‌పాడ్ బ్యాలెన్సింగ్ జలాశయం నుంచి రెండో దశ భీమా ఎత్తిపోతల పథకానికి 872 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈఈ వర్షప్రసాద్ తెలిపారు. జలాశయం పూర్తి సామర్థ్యం 1,021.09 అడుగులకు సోమవారం నాటికి 1,021 అడుగుల నీటి నిల్వ ఉన్నాయి. జూరాల ఎడమ, సమాంతర కాల్వలతో పాటు వాగుల నుంచి 2,057 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రధాన ఎడమ కాల్వకు 1,054 క్యూసెక్కుల నీటితో పాటు ప్రాజెక్టు ఎడమ, కుడి కాల్వల నుంచి ఆయకట్టుకు 75 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంపై ఆధారపడిన ఆయా తాగునీటి పథకాలకు 75 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈఈ పేర్కొన్నారు.

రాఘవేంద్రుడికి ప్రత్యేక పూజలు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో వెలసిన గురు రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు జయతీర్థాచార్యులు, భీమాచార్యులు, తిరుమలాచార్యులు తెలిపారు. విద్యార్థి తీర్థ శ్రీపాదుల వారు, విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల ఆధ్వర్యంలో ఉదయం పదిసార్లు నిర్వాహకులు పూజలు చేశారు.

ఆత్మకూరు(అమరచింత), న్యూస్‌టుడే: పట్టణంలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీ సేవ చేపట్టారు. నిర్వాహకులు జోషి గుండాచారి, మస్తీపూరం రాజు, వెంకటేశ్ జోషి, రవి దేశాయ్, దివాంజి శ్రీనివాస్ రావు, దివాంజి వేదవ్యాస్ వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సమగ్ర వికాసం

స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాల ఏర్పాటుకు నిధులు

రాజోలి కేజీబీవీలో మొక్కలు నాటేందుకు గుంత తవ్వుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినులు

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సేవాభావం, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం నిర్వహిస్తోంది. గతేడాది నుంచి కొన్ని పాఠశాలల్లో అమలు చేస్తుండగా, మంచి ఫలితాలు రావడంతో.. తాజాగా మరికొన్ని బడుల్లో అమలు చేసేందుకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెలలోనే బృందాలను ఏర్పాటు చేసి, అమలు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సమగ్ర శిక్షా నుంచి ఆదేశాలందాయి.

రూ.3.94 కోట్లు..: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,227 ప్రభుత్వ పాఠశాలలుండగా, ఇప్పటికే 78 కస్తూర్బాల్లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం అమలవుతోంది. ఈ ఏడాది నుంచి 115 పీఎంశ్రీ పాఠశాలల్లో, 156 సాధారణ పాఠశాలల్లో అమలుకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఒక్కో పీఎంశ్రీ పాఠశాలకు రూ.2.50 లక్షలు చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.2.87 కోట్లు, సాధారణ పాఠశాలలకు రూ. 69 వేలు చొప్పున రూ.1.07 కోట్లు మంజూరయ్యాయి. విద్యార్థులకు అవసరమైన ప్రత్యేక యూనిఫామ్స్ అందించడంతో పాటు, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పించనున్నారు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులకు త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లా	జనరల్ పాఠశాలలు	నిధులు (రూ.లక్షల్లో)	పీఎంశ్రీ పాఠశాలలు	నిధులు (రూ.లక్షల్లో)
జోగులాంబ	45	31.05	22	55
మహబూబ్‌నగర్	40	27.60	26	65
నాగర్‌కర్నూల్	20	13.80	27	67.50
నారాయణపేట	37	25.53	19	47.50
వనపర్తి	14	9.66	21	52.50

నిర్వహించే కార్యక్రమాలు

సమగ్ర వికాసం: విద్యార్థుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి తోడ్పడుతుంది.

సేవా దృక్పథం: సమాజంలో తోటి వారికి సహాయం చేయడం, బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడం, పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యేలా నేర్పిస్తారు.

శిక్షణ శిబిరాలు: విపత్తుల సమయంలో చేయాల్సిన పనులు, ప్రథమ చికిత్స వంటి వాటిపై శిక్షణ ఇస్తారు.

అవుట్ డోర్ క్యాంపులు: ప్రకృతిని పరిశీలించడం, బృందంగా పని చేయడం, నాయకత్వ లక్షణాలు ఎలా అలవరచుకోవాలో నేర్పిస్తారు.

సీఎం సహాయ నిధి పేదలకు కొండంత అండ

లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి, న్యూస్‌టుడే: ఆరోగ్యశ్రీ లేనివారికి సీఎం సహాయ నిధి పేదలకు కొండంత అండగా ఉంటుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. వనపర్తిలో ఆయన స్వగృహంలో 150 మంది లబ్ధిదారులకు రూ.45.31లక్షల విలువైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన మంగళవారం నాటికి వెయ్యి రోజులకు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి యాదయ్య, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, సర్పంచి కుర్మన్న, నాయకులు ఆగర్ నాగరాజు, బాబా, సాహేదుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, మన్యం యాదవ్, వనపర్తి, పెద్దమందడి, పెబ్బేరు మండలాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రప్రసాద్ యాదవ్‌కు సన్మానం..: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్ యాదవ్‌ను ఇటీవల నియమించారు. సోమవారం వనపర్తిలో ఆయనను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సన్మానించారు.

విశ్వశాంతి మహాయాగం

వనపర్తి, న్యూస్‌టుడే: మర్రికుంటలో కృష్ణ పీఠాధిపతి శ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో సోమవారం విశ్వశాంతి మహాయాగ మహోత్సవం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీరాముల నిత్య కల్యాణం చేశారు. అనంతరం యాగశాలలో లక్ష్మీగణపతి, ఆహార పాశుపత రుద్ర, అమృత మృత్యుంజయ, చండీ, సుదర్శన హోమం అనంతరం ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన చేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: మైనార్టీ వర్గాలకు చెందిన యువతకు గ్రూప్-1, 2, 3, 4 ఉద్యోగాలకు ఉచిత ఉదయ ప్లేస్ ఫౌండేషన్ శిక్షణకు సెప్టెంబరు 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి యండీ సిరాజుద్దీన్ అఫ్జల్ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న అర్హులన్నారు. ఆసక్తి గల యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 90590 50062 నంబరును సంప్రదించాలన్నారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీలు

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే: మండలంలోని రెండు రైస్‌మిల్లుల్లో పౌరసరఫరాల శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రీరంగాపురంలోని లక్ష్మీనరసింహ, శేరుపల్లిలోని సప్తగిరి రైస్‌మిల్లుల గోదాముల్లోని ధాన్యం నిల్వలు లెక్కించారు. కేటాయించినది, చెల్లించినది, ఇంకా చెల్లించాల్సిన ధాన్యం లెక్కించాల్సి ఉందని పూర్తి వివరాలను మంగళవారం తెలియజేస్తామని డీఎస్వో ఆంజనేయులు తెలిపారు. తనిఖీల్లో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చాం

అమరచింత, న్యూస్‌టుడే: పేదలకు సొంత ఇంటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత అన్నారు. సోమవారం మండలంలోని కొండ కవానిపల్లె, నాగల్‌కడ్మూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతి మండలానికి 500 ఇళ్లు మంజూరు చేసి, నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. సర్పంచులు రాజేందర్ రెడ్డి, శివకుమార్, కాంగ్రెస్ నాయకులు రమేశ్, రవి. భగవంత్ రెడ్డి, రవికాంత్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ గుండాల దాడి పిరికిపంద చర్య'

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర కార్యాలయంపై సోమవారం కాంగ్రెస్ గుండాల దాడి ఓ పిరికిపంద చర్య అని ఎంపీ డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ ప్రతిని చేతబట్టి నీతి సూక్తులు వల్లించే డూప్లికేట్ గాంధీ ఈ దాడిపై స్పందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ దివాలా కోరుతనానికి, నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఉన్న భాజపా కార్యాలయానికి రక్షణ కల్పించడంలో ఇంటెలిజెన్స్, స్థానిక పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని, అధికార పార్టీ కనుసన్నల్లోనే ఈ దాడి జరిగిందనేది స్పష్టమవుతోందని డీకే అరుణ తీవ్రంగా ఖండించారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

కిషన్ రెడ్డి, ఎంపీ డీకే అరుణకు స్వాగతం పలుకుతున్న భాజపా రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, పార్టీ నాయకులు

అమరచింత, న్యూస్‌టుడే: జోగులాంబ గద్వాల జిల్లా నుంచి జూరాల ప్రాజెక్టు మీదుగా నారాయణపేటకు వెళ్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డీకే అరుణకు భాజపా మక్తల్ నియోజకవర్గ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. జూరాల ప్రాజెక్టు వద్ద పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. పార్టీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, చేనేత సహకార సంఘం ఛైర్మన్ టి.రఘురాం, కార్యదర్శి అనిల్, కౌన్సిలర్లు మేర్వ రాజు, ఉశన్న, విష్ణు, నాయకులు నారాయణ, లలిత, అశోక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ● నియోజకవర్గాల పునర్విభజనలో అమరచింతను కొత్త నియోజకవర్గంగా చేయాలని కేంద్ర మంత్రిని అమరచింత అభివృద్ధి కమిటీ ద్వారా సత్యందర్, శ్రీనివాసులు, రాజు వినతిపత్రం ఇచ్చారు.

హామీల అమలుకు డిమాండ్

పాన్‌గల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద సీపీఎం నాయకుల నినాదాలు

పాన్‌గల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పాన్‌గల్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మహ్మద్ జబ్బార్ మాట్లాడారు. విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు. సర్పంచులు నిరంజన్, జములయ్య, మండల కార్యదర్శి బాల్యానాయక్, నాయకులు పాల్గొన్నారు.

కొత్తకోట, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం మద్దతుదారులు ధర్నా చేశారు. సోమవారం మండల నాయకులు నిక్సన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగిది. అనంతరం ఎంపీడీవో వినీత్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో చిన్న వెంకటయ్య, ఆశన్న, బాలస్వామి, కృష్ణయ్య, రమేష్ ఆశన్న శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలల్లో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని సోమవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ రమేశ్ రెడ్డికి వినతిపత్రమిచ్చారు.

అమరచింత, న్యూస్‌టుడే: విద్య, వైద్యం, ప్రజా సమస్యలు పరిష్కరించాలని సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీఎస్.గోపి, జిల్లా సభ్యులు రమేశ్, వెంకటేశ్, అజయ్, రాఘవేందర్ మాట్లాడారు.

వేసవి నాటికి తాగునీటి సమస్యకు పరిష్కారం

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో వేసవి నాటికి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నూతనంగా నిర్మిస్తున్న అమృత్ 2.0 నీళ్ల ట్యాంకుల పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని పుర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ గుత్తేదారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని 3, 10వ వార్డుల్లో నిర్మిస్తున్న నీటి ట్యాంకుల పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా పుర అధ్యక్షుడు మాట్లాడుతూ.. ట్యాంకుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చేపడుతున్న సీసీ బెడ్ నిర్మాణ పనులను పరిశీలించారు. బస్సులు, ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలగకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. ఆయన వెంట పుర ఉపాధ్యక్షురాలు సుమిత్ర, కౌన్సిలర్లు పర్వీన్, జములమ్మ, హరిశంకర్ నాయుడు, నాయకులు షకీల్, సునీల్, గుత్తేదారులు, తదితరులు ఉన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

పాన్‌గల్, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రత పాటించాలని, తద్వారా రోగాలు దరిచేరవని డా.మైథిలీ అన్నారు. మండలంలోని దావాజిపల్లి గ్రామంలో ఒకరికి డెంగీ జ్వరం రావడంతో సోమవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రామచందర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో వివక్ష

భాజపా, భారాస ధర్నా

భాజపా, భారాస కౌన్సిలర్లు, నాయకుల నిరసన

ఆత్మకూరు(అమరచింత), న్యూస్‌టుడే: పుర ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్, కౌన్సిలర్ల తీరును నిరసిస్తూ సోమవారం జరిగిన పురపాలక సంఘం సాధారణ సర్వసభ్య సమావేశాన్ని భాజపా, భారాస కౌన్సిలర్లు బహిష్కరించారు. కార్యాలయం ఎదుట వారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా భాజపా కౌన్సిలర్లు జ్యోతి, భరత్, భారాస కౌన్సిలర్ శంకరమ్మ మాట్లాడారు. పట్టణాభివృద్ధికి రూ.7 కోట్లు నిధులు మంజూరైనప్పటికీ వాటి కేటాయింపులో తమ వార్డులకు అన్యాయం జరుగుతోందన్నారు. పార్టీలను చూసి కాదు, ప్రజల అవసరాలను చూసి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కమిషనర్ నరేశ్ కుమార్ నిధుల కేటాయింపుల్లో పారదర్శకత, సమానత్వం చూపాలని కోరారు. భాజపా, భారాస నాయకులు సమద్, ఆనంద్, అశోక్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పెబ్బేరు, న్యూస్‌టుడే: మండలంలోని సూగూరు 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో మంగళవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్తు ఏఈ కిరణ్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదన్నారు. సూగూరు, జనుంపల్లి, బునియాది పురం, రంగాపూర్, జానంపేట, మునగమాన్‌దిన్నె, పెంచికల పాడు గ్రామాల్లో వ్యవసాయం, గృహాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నిర్భయంగా సేవలు వినియోగించుకోండి

బాధితులతో సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సునీతా రెడ్డి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ప్రస్తుతం రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ నడుస్తోందని ప్రజలు భయం లేకుండా స్వేచ్ఛగా పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సునీతా రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి స్వీకరించిన ఫిర్యాదులను పోలీస్ స్టేషన్ల వారీగా విభజించి సంబంధిత ఎస్సైలతో చరవాణిలో మాట్లాడారు. సత్వరమే ఫిర్యాదులను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. మొత్తం 13 ఫిర్యాదులు అందాయి.

సర్వే నంబర్ల వారీగా నివేదిక ఇవ్వాలి

వనపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల 22ఏ కింద నమోదైన సర్వే నంబర్ల వారీగా నివేదిక ఇవ్వాలని అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో 22ఏ భూములపై తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డి సెక్షన్ సూపరింటెండెంట్ సునీత, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు..

హిందీ భాషపై పట్టు సాధించేలా బోధన

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: హిందీ భాషపై విద్యార్థులు పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రిసోర్స్ పర్సన్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన ఖిల్లాగణపురంలోని బాలుర ఉన్నత పాఠశాలలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు కాళిదాసు అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని వివిధ పాఠశాలల నుండి వచ్చిన హిందీ ఉపాధ్యాయులకు పలు సూచనలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ హిందీ ఉపాధ్యాయులు గీత, అంజలయ్య, సురేశ్, శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వ్యాసరచన పోటీలు..: ప్రస్తుత సమాజంలో దారి తప్పుతున్న విద్యార్థి లోకం అనే అంశంపై మంగళవారం ఎమ్మార్సీ భవనంలో మండలంలోని ఉపాధ్యాయులకు వ్యాసరచన పోటీలు ఉంటాయని మండల విద్యాధికారి జయశంకర్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 3గంటల వరకు పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: పర్వతాపురం గ్రామానికి చెందిన ఉదయ్‌కిరణ్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఆగస్టు 26, 27వ తేదీల్లో హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర సబ్‌జూనియర్(2) అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటాడు. సెప్టెంబరు 17 నుంచి 21వ తేదీ వరకు పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొననున్నట్లు ఉదయ్‌కిరణ్ తెలిపారు.

బీడీ కార్మికుల పింఛన్లకు హైకోర్టును ఆశ్రయిస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సూర్యం

అమరచింత, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పథకంలో బీడీ కార్మికులకు చేయూత పింఛను ఆప్షన్ కోసం హైకోర్టును ఆశ్రయిస్తామని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సూర్యం అన్నారు. సోమవారం పట్టణంలోని మాస్‌లైన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి వల్ల బీడీ కార్మికులు నష్టపోతున్నారని తెలిపారు. సమావేశంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు సి.రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు మస్తామని, సత్యనారాయణ, జిలానీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

అమరచింత, న్యూస్‌టుడే: భూత్పూర్ ప్రధాన ఎడమ కాలువ పరిధిలోని ధర్మపూర్, మస్తీపూర్, అమరచింత, పిన్నంచర్ల గ్రామాలకు సాగునీరు రావడం లేదని రైతులు మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సోమవారం పొక్లెయిన్ ఏర్పాటు చేసి జమ్ము, పూడిక తొలగింపు పనులను ప్రారంభింపజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రమేశ్, నాయకులు రవి, రవికాంత్, కమలాకర్ గౌడ్, వెంకటయ్య, బీసీ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

వనపర్తిలో: వినతులు తీసుకుంటున్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

న్యూస్‌టుడే, బృందం: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధితాధికారులు సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. సోమవారం వనపర్తి కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అదనపు కలెక్టర్‌తో కలెక్టరేట్ కార్యాలయ ఏవో భానుప్రకాష్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 16 దరఖాస్తులొచ్చాయి. ● జిల్లాలో ఆయా మండల కేంద్రాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది.

ఉపకార వేతనాలు విడుదల చేయకుంటే అసెంబ్లీ ముట్టడి

ప్రసంగిస్తున్న భాజపా జిల్లా ఇన్‌ఛార్జి బొక్క బాల్‌రెడ్డి

వనపర్తి, న్యూస్‌టుడే: బకాయిపడ్డ ఉపకారవేతనాలు (ఫీజు రీయింబర్స్‌మెంట్) రూ. 15వేల కోట్లు విడుదల చేయకుంటే భాజపా ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి బొక్క బాల్‌రెడ్డి అన్నారు. ఫీజుల బకాయి భాజపా లడాయి కార్యక్రమంలో భాగంగా సోమవారం భాజపా, బీజేవైఎం ఆధ్వర్యంలో రాజీవ్‌చౌక్‌లో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ దీక్షకు ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాల అసోసియేషన్ నాయకులు మద్దతు తెలిపారు. భాజపా జిల్లా అధ్యక్షుడు నారాయణ, నాయకులు వెంకట్‌రెడ్డి, మున్నూరు రవీందర్, శ్రీశైలం, అనుజ్ఞారెడ్డి, పెద్దిరాజు, శ్రీనివాస్‌గౌడ్, అలివేల, కవిత పలువురు పార్టీ నాయకులు, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

పాన్‌గల్, న్యూస్‌టుడే: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పింఛను విధానం అమలు చేయాలని కోరుతూ సోమవారం ఉద్యోగులు పాన్‌గల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించే విధులకు హాజరయ్యారు. టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయుడు మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలను తక్షణమే ఇవ్వాలని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్తిక్ రావు, ఆర్ఐ మహేశ్ పాల్గొన్నారు.

వృథాగా సాగునీరు

ఊర చెరువు కిందకు వృథాగా పారుతున్న సాగునీరు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అమడబాకుల ఊర చెరువుకు ఏనుగుంట జలాశయం నుంచి శ్రీరంగాపురంలోని రంగసముద్రానికి కాలువ ద్వారా సాగు నీటిని తరలిస్తున్నారు. కాలువల సమీపంలోని చెరువులు, కుంటలను నింపేందుకు తూములను ఏర్పాటు చేశారు. వారం రోజులుగా చెరువుకు నీటి విడుదల కొనసాగడంతో చెరువు నిండుకుండను తలపిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడంతో నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నా ఇక్కడ వృథాగా పోతున్న సాగునీటిని అరికట్టడంలో మాత్రం విఫలమవుతున్నారని రైతులు వాపోతున్నారు. అవసరమైన వేళ తూమును తెరిస్తే బాగుంటుందని కోరుతున్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

మూసాపేట, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న బైకును లారీ ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన నర్సింహ ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. సోమవారం రాత్రి మూసాపేట వంతెన నిర్మాణం వద్ద వెనక నుంచి లారీ ఢీకొట్టింది. ఆయన కుడికాలు నుజ్జునుజ్జు అయింది. పోలీసులు క్షతగాత్రుడిని మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవరు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు.

సంచారజాతి విముక్త దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

వనపర్తి, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సంచారజాతి విముక్త కార్యక్రమాన్ని గ్రామీణ పోలీసులు అడ్డుకున్నారు. సంచారజాతికి చెందిన పలువురు కులవృత్తుల ద్వారా కార్యక్రమానికి హాజరయ్యారు. పోలీసులు చేరుకొని కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతి తీసుకున్నారా అని నిర్వాహకులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా సంచార జాతుల జిల్లా అధ్యక్షుడు భూమయ్య మాట్లాడుతూ సంచారజాతి విముక్త కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని, దానికి సంబంధించిన జీవో కాపీని చూయించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొనకపోవడం బాధాకరమని, ఎంబీసీ కార్పొరేషన్ ఉన్నా సంచారజాతికి ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఈ సందర్భంగా గంగిరెద్దుల సంఘం నాయకులు కృష్ణ, నరసింహ గంగిరెద్దులను తెచ్చి విన్యాసాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం జాతీయ కార్యదర్శి ఈశ్వర్, నాయకులు నరసింహ, ఎం. ఈశ్వర్, రామచందర్, గోపాల్, వీరభద్ర, శివంగి, వెంకటేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా దీప

వనపర్తి, న్యూస్‌టుడే: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా, సీనియర్ సివిల్ జడ్జి దీప కసరగడ్డ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వి.రజని ఇటీవల నాంపల్లి కోర్టుకు బదిలీపై వెళ్లడంతో పోస్టు ఖాళీగా ఉంది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న ఆమెకు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు.

భారాస ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

వీపనగండ్లలో రక్తదానం చేస్తున్న యువకులు

పాన్‌గల్, న్యూస్‌టుడే: కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సోమవారం పాన్‌గల్‌లో భారాస నాయకులు సోమిశెట్టి కిషోర్‌శెట్టి సహకారంతో రక్తదానం శిబిరం నిర్వహించారు. 40 మంది రక్తదానం చేశారు. అనంతరం అంబేడ్కర్‌చౌరస్తాలో కేక్‌కట్ చేసి అన్నదానం చేశారు.

వీపనగండ్ల, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం భారాస ఆధ్వర్యంలో వీపనగండ్లలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు.

చిన్నంబావి: మండల కేంద్రంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలను భారాస ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రక్తదాన శిబిరంలో పార్టీ కార్యకర్తలు రక్తదానం చేశారు.

మహాసభ విజయవంతానికి పిలుపు

ఆత్మకూరు(అమరచింత): ఈనెల 9న వరంగల్‌లో నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు కె.మస్తాన్ మాదిగ, చెన్న కేశవులు, జిల్లా నాయకులు మాసన్న, కురుమన్న, శ్రీనివాసులు కోరారు. సోమవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మహాసభల గోడపత్రిక విడుదల చేసి మాట్లాడారు. గాలిపంపు శ్రీను, వెంకటన్న, భగవంతు, వెంకటేశ్, గణేశ్, పరశురాం పాల్గొన్నారు.

(c) eenadu